ప్రజాశక్తి
గురువారం 27 ఏప్రిల్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కు పరిరక్షణకు ఐక్య పోరాటం

- దేశాన్ని కొల్లగొడుతున్న మోడీకి పాలించే హక్కు లేదు
- సిపిఎం, సిపిఐ 'ప్రచారభేరి' బహిరంగ సభలో వక్తలు
- పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి.రాఘవులు, భారీ సంఖ్యలో హాజరైన ప్రజానీకం

ప్రజాశక్తి - ఉక్కునగరం

'దేశం అభివృద్ధి చెందుతోందంటూ బిజెపి నేతలు ఊదరగొడుతున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ లాంటివి ఇంకా అనేకం దేశంలో రావాల్సి ఉండగా ఉన్నదాన్ని అమ్మేయాలని చూడడం ఏం అభివృద్ధి ?. 804 రోజుల నుంచి కార్మికులు ఆందోళన చేస్తున్నారు. ఈ పోరాటం రాజకీయ పోరాటంగా మారేందుకు రాష్ట్రంలో పార్టీలన్నీ కలిసి రావాలి. ఆ దిశగా సిపిఎం, సిపిఐ కృషి చేస్తాయి' అని వక్తలు ఉద్ఘాటించారు. బుధవారం సాయంత్రం విశాఖలోని కూర్మన్నపాలెం కూడలిలో ఉన్న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 'స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని తక్షణం కేంద్ర ప్రభుత్వం ఆపాలి' అని కోరుతూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన భారీ బహిరంగ సభ జరిగింది. ఆ పార్టీల జాతీయ నాయకులు హాజరై మాట్లాడారు. ఆద్యంతం వారి ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఈ సభకు పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు హాజరయ్యారు.

సభలో ముఖ్య అతిథి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారిభేరి సాగుతోందన్నారు. దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న మోడీకి వైసిపి, టిడిపి, జనసేన అంటకాగుతున్నాయని విమర్శించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ దేశాన్ని అమ్మకానికి పెట్టిన మోడీకి పాలించే అర్హత లేదన్నారు. గుజరాత్‌లో నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అదానీ ఓ స్మగ్లర్ అని తెలిపారు. నాటి నుంచి నేటి వరకూ దేశ ప్రజల సంపదను దోచుకుంటున్నారని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు.. ఇలా అన్నింటినీ మోడీ అదానీకి కట్టబెడుతున్నారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖలో ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసేందుకు మోడీ సర్కారు ఎలాంటి కుట్రలు పన్నుతోందో వివరించారు. ప్లాంట్‌కు మిగతా 2లో..

కళారూపాలతో ఆకట్టుకున్న మహిళలు

అరకొరగానే జి20 సుందరీకరణ

వార్త 3లో..

టీచర్లను భయభ్రాంతులకు గురిచేయడం తగదు

వార్త 5లో..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు

వార్త 8లో..

ఈ ఏడాదీ బాలికలదే హవా

-దిగజారుతున్న ఇంటర్ ఫలితాలు

-మొదటి ఏడాదిలో 63, రెండో ఏడాదిలో 70 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, ఎంవిపి.కాలనీ

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గతేడాది వలె ఈ ఏడాదీ ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో బాలికల హవా కనిపించింది. రాష్ట్ర స్థాయి ఫలితాలతో పోల్చిచూస్తే జిల్లాలో ఇంటర్ ఫలితాలు గతేడాది కంటే దిగజారాయి. బుధవారం సాయంత్రం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్ ఫలితాలు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో గతేడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ఉమ్మడి జిల్లా మూడో స్థానంలో ఉండగా, ఇప్పుడది ఐదో స్థానానికి పడిపోయింది. రెండో సంవత్సర ఫలితాల్లో నాలుగో స్థానంలో ఉండగా ఈ ఏడాది ఐదో స్థానానికి వచ్చింది. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో 50,647 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరిలో 31,957 (63 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 42,248 మంది పరీక్షలు రాయగా 29,755 (70శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ తొలి ఏడాదిలో బాలురు 25,806 మంది పరీక్షలకు హాజరుకాగా, 15,835 మంది (61శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 24,841 మంది పరీక్షలకు హాజరుకాగా 16,122 మంది (65శాతం) ఉత్తీర్ణులయ్యారు. రెండో ఏడాదిలో బాలురు 20,459 మంది పరీక్షలకు హాజరుకాగా 14,017 మంది (69శాతం), బాలికలు 21,789 మందికి 15,738 మంది (72శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఒకేషనల్ మొదటి సంవత్సరంలో మిగతా 2లో..

డిఆర్‌సిలో అంశాలపై సత్వర చర్యలు

డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

- వీధిలైట్లు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జిల్లా సమీక్షా మండలి సమావేశంలో చర్చించిన ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా మండలి సమావేశం మంత్రి విడదల రజిని అధ్యక్షతన బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా గత డిఆర్‌సి లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికపై చర్చించారు. తదుపరి జివిఎంసికి చెందిన అభివృద్ధి పనులు, విఎంఆర్‌డిఎ, జగనన్న హౌసింగ్, గృహ నిర్మాణ శాఖ, ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, నాడు- నేడు, ప్రాధాన్యత భవనాలు, ఆర్‌బికెలు, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా పోలీస్ పెట్రోలింగ్ పెంచి యువత పెడదారి పట్టకుండా నిరోధించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సి.సి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీధి లైట్లను మూడు నెలలలోగా ఏర్పాటుచేయాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం జరపాలని, అవసరమైన సిబ్బందిని ఏర్పాటుచేసుకోవాలని జివిఎంసి కమిషనర్‌కు సూచించారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ, సింహాచలం బిఆర్‌టిఎస్ రోడ్డు నిర్మాణానికి ఉన్న అవరోదాలను అధిగమించి పూర్తి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'ఉక్కు' పరిరక్షణకు ఐక్య పోరాటం

కాపాడుకోవడానికి వామపక్షాలు చేస్తున్న కృషిని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఐక్య పోరాటాలతో విజయం సాధ్యమవుతుందన్నారు. పోరాటాలకు వామపక్ష పార్టీలు పెట్టింది పేరని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను ఎలా కాలరాస్తోందో వివరించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అశేష త్యాగాలతో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వం వంద శాతం అమ్మకానికి పెట్టడం దుర్మార్గమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మోడీ సర్కారు కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో విపరీతంగా ధరలు పెరగడంతో సామాన్యులపై పెను భారాలు పడుతున్నాయన్నారు. నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు కేంద్రాన్ని నిలదీయడం లేదని తెలిపారు. సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు, 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, వామపక్ష పార్టీల నేతలు ఎన్.రామారావు, కసిరెడ్డి సత్యనారాయణ, శ్రీనివాసరాజు, తాండ్ర కనకరాజు, ఐద్వా నాయకులు సత్యవతి, కె.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు. సభా వేదికపై ప్రజా నాట్యమండలి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఈ ఏడాదీ బాలికలదే హవా

4,380 మందికి 2,209 మంది (50శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 3,783 మందికి 2,631 మంది (70శాతం) విద్యార్థులు పాసయ్యారు. ఒకేషనల్ మొదటి ఏడాదిలో రాష్ట్రంలో జిల్లాకు ఆరోస్థానం, రెండో ఏడాదిలో మూడో స్థానం దక్కింది.

డిఆర్‌సిలో అంశాలపై సత్వర చర్యలు

చేయాలన్నారు. దీనికి సంబంధించి 900 మీటర్ల పరిధిలో భూ సమస్య, 1.1 కి.మీలో ట్రక్కర్స్ గుర్తించామని వీరికి నష్ట పరిహారం సమస్య త్వరలో పరిష్కారమవుతుందని చెప్పారు. 4 నియోజకవర్గాలలో రోడ్ల పనులను గుర్తించి త్వరలో పూర్తిచేయాలని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. రోడ్లలో వీధి దీపాలు, మంచి నీటి సమస్యలను పరిష్కరించాలన్నారు.

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వీధి లైట్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయ్యాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వీధి లైట్లకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌ను కేటాయించాలని జివిఎంసి కమిషనర్‌ను కోరారు. భీమిలి నియోజకవర్గంలో కొత్తగా సిహెచ్‌సి ఏర్పాటు చేసి వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో 85, 87వ వార్డుల్లో వీధి దీపాలు, తాగునీరు సమస్య అధికంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని, మున్సిపల్ నీటి కుళాయిలు విడుదల సమయాన్ని ఒక గంట పాటు పెంచాలని కోరారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, పాడు పడిన ప్రియదర్శిని స్టేడియం భవనాన్ని పునర్నిర్మించాలని, కనకమహాలక్ష్మి దేవాలయం పరిసరాలను, రోడ్డును విస్తరించాలని కోరారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గంలో పలు రోడ్డు పనులు పెండింగులో ఉన్నాయని, వాటిని పూర్తిచేయాలని, సుజాతనగర్‌లో పందుల సమస్యను పరిష్కరించాలని కోరారు. విఎమ్ఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ, అరిలోవ, యూనివర్సిటీలో పలు చోట్ల అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, పోలీస్ అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ, యుఎల్‌సి భూములలో ఇల్లు కట్టుకున్న వారు గతంలో ఇచ్చిన జీవోలో ఫీజులు చాలా అధికంగా ఉన్నందున ఇప్పుడు స్లాబ్ సిస్టం ద్వారా టైటిల్ డీడ్ పొందుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ సమీక్షలో మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, వేపాడ చిరంజీవిరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తానా మహాసభలకు శ్రీధర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) తరుపున ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో ఈ ఏడాది జూలై 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగబోయే తెలుగు మహాసభలకు ఆహ్వానాన్ని విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందుకున్నారు. ఈ మేరకు బుధవారం (తానా) సంఘం ప్రతినిధులు జియ్యాని శ్రీధర్‌కు ఆహ్వాన పత్రికను పంపారు.

భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించండి

ప్రజాశక్తి-విశాఖపట్నం : వార్డులలో చాలా చోట్ల భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.

ఘనంగా రంగసాయి నాటక గ్రంథాలయ వార్షికోత్సవం

నాటక రచయితలకు సత్కారాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రంగసాయి నాటక గ్రంథాలయం వార్షికోత్సవాన్ని టివిఎస్సార్ కాంప్లెక్స్‌లోని రంగ సాయి నాటక గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. రంగ సాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వివి రమణమూర్తి, ప్రముఖ రంగస్థల నటులు, రచయిత డాక్టర్ మీగడ రామలింగస్వామి, నటులు డాక్టర్ రాజా కృష్ణమూర్తి, బొట్టా వేణు, బి.మాల్యాద్రి, మేడ మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ నాటకాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాటక రచయితలు కొరిటాల ప్రభాకరరావు, పిటి.మాధవ్, దండు నాగేశ్వరరావు, విశ్వనాథ గణపతిరావు, రావి నాగేశ్వరరావును సత్కరించారు. ప్రముఖ నట దర్శకులు పి.శివప్రసాద్ పర్యవేక్షణలో కన్యాశుల్కం నాటకం నుంచి సాయంకాలమైంది సీన్‌ను బాల నటులు సుమంత్, నవనీత్ ప్రదర్శించారు. అనంతరం నవచైతన్య కళానాట్య సంక్షేమ సంఘం వారిచే ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం హాస్య ప్రహసనాన్ని చిన్నారెడ్డి, పి.పోతురాజు, సిహెచ్.పద్మ ప్రదర్శించారు.

ప్రముఖ నాటక రచయితలను సన్మానిస్తున్న నిర్వాహకులు

సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సీనియర్ నటి డి.హేమ, వర్రె నాంచారయ్య, గ్రంథ పాలకులు జమ్మా చిన్నబాబు, ఎన్.బంగార్రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైసిపి నేత పక్కి దివాకర్ హఠాన్మరణం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : నగరానికి చెందిన వైసిపి సీనియర్ నేత పక్కి దివాకర్ (57) బుధవారం హఠాన్మరణం చెందారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఒడిశాలోని పూరి జగన్నాథ స్వామి ఆలయానికి వెళ్లి, పూజలు నిర్వహించి ఆలయం నుంచి వెలుపలకు వస్తున్న సమయంలో కుప్పకూలి మరణించారు. దివాకర్ పూర్తి పేరు పక్కి వెంకట సత్య దివాకర్. రాష్ట్రస్థాయిలో ఎపి బిసి కమిషన్ సభ్యునిగా ప్రస్తుతం పదవిలో ఉన్నారు. సీమాంధ్ర కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా, బిసి డెవలప్‌మెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షునిగా, ఇన్ ఫ్రా ప్రాజెక్టు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, భారత్ ఇన్ఫో కామ్ డిజిటల్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పలు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నగరంలోని మర్రిపాలెంలో నివసిస్తున్న దివాకర్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె సివిల్స్ చదువుతోంది. దివాకర్ మరణ వార్త తెలియడంతో నగరంలోని వైసిపి నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

పోలీస్ అధికారుల బదిలీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్రం వ్యాప్తంగా పలువురు డిఎస్‌పి స్థాయి పోలీసు అధికారులను బదిలీ చేస్తూ డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ బదిలీలలో విశాఖపట్నానికి చెందిన అధికారులు ఉన్నారు. వారిలో విశాఖపట్నం హార్బర్ ఎసిపీగా పనిచేస్తున్న ఎస్.శిరీషను కర్నూలు డిఎస్‌పిగా, విశాఖపట్నం నార్త్ ఎసిపి సిహెచ్.శ్రీనివాసరావును పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. వారి స్థానంలో హార్బర్ ఎసిపిగా ఇప్పటివరకు గుంటూరు సిసిఎస్-2లో పనిచేసిన బి.మోసెస్‌పాల్‌ను, నార్త్ ఎసిపిగా కాశీబుగ్గ సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.శివరాంరెడ్డిని నియమించారు. అనకాపల్లి సబ్-డివిజన్లో విధులు నిర్వహిస్తున్న బి.సునీల్‌ను విశాఖపట్నం క్రైమ్ ఎసిపిగా బదిలీ చేశారు.

దిశ సఖి ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కెజిహెచ్‌లో ఉన్న దిశ సఖి వన్ స్టాప్ సెంటర్‌లో పనిచేస్తున్న 15 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు బకాయి ఉన్న 5 నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంతో నడుస్తున్న ఈ సెంటర్‌లో కో-ఆర్డినేటర్ నుంచి వాచ్ మ్యాన్ వరకు అందరూ కాంట్రాక్టు ఉద్యోగులేనని తెలిపారు. వేతనాలు అందేటట్లు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

దేవాదాయ శాఖలో ముగ్గురికి ప్రమోషన్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు గ్రేడ్ -3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా ప్రమోషన్ కల్పిస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా ప్రమోషన్ పొందిన వారిలో పి.మురళీమోహనరావు, (ఎర్నిమాంబ దేవస్థానం), జి.గంగారావు (చిన్నవాల్తేరులోని శ్రీ కనకమ్మ అమ్మవారి దేవస్థానం), ఎస్.శ్రీనివాసరావు (అనకాపల్లిలోని శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం) ఉన్నారు. వారిని విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలలో నియమించే అవకాశాలు ఉన్నాయి. ప్రమోషన్ పొందిన ఉద్యోగులు బుధవారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ కె.శిరీషలను మర్యాద పూర్వకంగా కలిశారు.

7న అల్లూరి వర్థంతి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఎయు తెలుగు విభాగం, సమైక్యభారతి సంయుక్త ఆధ్వర్యాన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్థంతిని మే 7 తేదీన సాయంత్రం 5 గంటలకు ఆర్కె బీచ్‌లో నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎయు ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇండిపెండెంట్ డైరెక్టర్ ఎస్.కాశీవిశ్వనాథరాజు, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ బూసి వెంకటస్వామి పాల్గొన్నారు. శత వర్థంతి సందర్భంగా మే 7 తేదీన గాంధీ పార్క్ దసపల్లా హిల్స్ వద్ద ఉదయం 10 గంటలకు ఉచితవైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహోన్నత వ్యక్తి భానోజీరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అంకిత వెంకట భానోజీరావు మహోన్నత వ్యక్తి అని వక్తలు కొనియాడారు. భానోజీరావు 45వ వర్థంతిని బుధవారం ఎవిఎన్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఆవరణలో భానోజీరావు విగ్రహానికి కళాశాల నిర్వాహకులు బుధవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఉమ్మడి ఎపి రాజకీయాలతో పాటు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లోనూ భానోజీరావు ఎంతగానో కష్టి చేసి ఖ్యాతి గడించారని చెప్పారు. డీన్ శంకరనారాయణ మాట్లాడుతూ కెజిహెచ్‌కు తమ సొంత భూములను కేటాయించడంతో పాటు భవన నిర్మాణాలకూ సహకరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ సత్యనారాయణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మంగమ్మ, కళాశాల ఆంగ్ల విభాగాధిపతి పైడి రజని, అధ్యాపకులు కృష్ణకుమారి, శ్రీనివాస్, సంతోష్, అర్చన పాల్గొన్నారు.

755వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 755వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు విళ్ల రామ్మోహన్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వి.హెచ్.కన్నారావు, దేవర అప్పలరాజు పాల్గొన్నారు.

1న టిడిపి మే డే సభ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : టిడిపి, టిఎన్‌టియుసి ఆధ్వర్యాన మే 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు గాజువాక లంకా మైదానంలో మేడే ఉత్సవాలను, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ సభకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారాపు అచ్చన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎం.శ్రీభరత్, పాశర్ల ప్రసాద్, నక్కా లక్ష్మణరావు, లెనిన్ బాబు, బండారు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, NAGA VENKATA ADITYA VURUM (Old Name) S/O NAGA VENKATA SOMA SEKHAR. Resident of : 2-5, near Galigopuram, Sanivarapupeta, Eluru, West Godavari, Change my name from **NAGA VENKATA ADITYA VURUM** (Old Name) to **NAGA VENKATA ADITYA KUMAR VURUM** (New Name). Hence forth I am being Called as **NAGA VENKATA ADITYA KUMAR VURUM** (New Name) S/O NAGA VENKATA SOMA SEKHAR for all purposes.

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P. No. 159/2022

Between:
Dadala Satya Prasad ...*Petitioner*
AND
Bonthu Koteswara Rao and others ...*Respondents*

Notice to Respondent:
R-2: Kudipudi Krishna, S/o. Subramanyam, age not known, D.No. 6-38-45/2/1, L.V.Nagar, Chinagantyada, Gajuwaka, Visakhapatnam, Pin: 530026 (Owner of Car bearing Regd. No. AP 31 CT 5559)

In the above M.V.O.P. No 159/2022 the 2nd respondent hearing date stand posted to **12-06-2023 at 10.30 AM** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex-party in your absence.

Hearing date: 12-06-2023

N.RAJASEKHAR, Advocate
Amalapuram, Amalapuram, E.G.Dt
Dt: 07-04-2023 Cell: 9849193665

మధ్యలోనే ఆగిపోయిన ఏప్రాన్ పనులు

ఆర్భాటం.. అటకెక్కింది..

అరకొరగానే జి20 సుందరీకరణ

- సదస్సు ముగిసిన వెంటనే ఎక్కడికక్కడే నిలిచిన పనులు
- దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న అర్థాంతర నిర్మాణాలు
- నెలరోజులైనా పత్తాలేని అధికారులు, కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - భీమునిపట్నం : విశాఖలో ఎంతో అట్టహాసంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జి20 సదస్సు నేపథ్యంలో మహానగరంలో చేపట్టిన పలు ఆధునికీకరణ, సుందరీకరణ, అభివృద్ధి పనులన్నీ ఎందుకనో అర్థాంతరంగా నిలిచిపోయాయి. సదస్సును మైలురాయిగా నిలిపేందుకు, వచ్చే విదేశీ ప్రతినిధులను ఆకట్టుకునేందుకు వీలుగా నగరంతోపాటు శివారున ఉన్న భీమిలి పట్టణం, బీచ్‌రోడ్డులో చేపట్టిన పనులన్నీ అరకొరగా దర్శనమిస్తున్నాయి. పనులు ప్రారంభించినప్పుడున్న హడావిడి, హంగామా తర్వాత లేకపోవడంతో అనేక పనులు అర్థాంతరంగా నిలిచి, ఆంధ్రులు ఆరంభశూరులు అనే పేరును సార్థకం చేసేలా దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. తర్వాత రోజు నుంచి వీటివైపు కన్నెత్తి చూసే వారే లేకపోవడంతో కోట్లలో నిధులు దుర్వినియోగమే తప్ప, ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

విశాఖ నగరం వేదికగా గతనెల 28,29 తేదీల్లో జి20 సదస్సు అట్టహాసంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సదస్సుకు అనేక దేశాల ప్రతినిధులు రానుండడంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని మహానగరం సుందరీకరణ పనులు చేపట్టింది. నెలరోజుల ముందునుంచే నేతలు, అధికారులు హడావిడి చేస్తూ, వెంటబడి మరీ పనులు చేయించారు. అయితే హంగామా మిగిలిందే గానీ, సదస్సు రోజునాటికి అనేక పనులు పూర్తి చేయలేకపోయారు. సదస్సు ముగిసిన తర్వాత వాటి జోలికి రాకపోవడంతో అనేక పనులు అర్థాంతరంగానే మిగిలిపోయాయి. నెలరోజులౌతున్నా వీటివైపు కన్నెత్తి చూసే నాథులే లేకపోవడంతో దిష్టిబొమ్మల్లా మిగిలిపోయాయని పలువురు విమర్శిస్తున్నారు.

జి 20 సదస్సు నేపథ్యంలో నగర సుందరీకరణకు ప్రభుత్వం రూ 135 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగానే భీమిలి బీచ్‌రోడ్డు అభివృద్ధి, సుందరీకరణ, మౌలిక సదుపాయాలు కల్పనకు జివిఎంసి రూ.2.71కోట్లు కేటాయించింది. ఆ నిధులతో రోడ్డుకు ఇరువైపులా, డివైడర్లకు రంగులు, ఫుట్‌పాత్‌లకు హంగులు, గోడలకు విభిన్న తరహా బొమ్మలతో కూడిన వాల్ పెయింటింగులు, ఫ్లవర్ బాక్సలు ఏర్పాటు, బస్‌స్టాప్, మరుగుదొడ్ల ఆధునికీకరణ, సెంట్రల్ లైటింగ్ వంటి పనులు చేపట్టారు.

పనుల నాణ్యత విషయం పక్కన పెడితే, జి20 సదస్సు నాటికి పనులు పూర్తికాకపోవడం, తర్వాత వీటి ఊసెత్తకపోవడంతో నెలరోజులు గడిచిన అలాగే అర్థాంతరంగానే దర్శనమిస్తున్నాయి. పనులు ప్రారంభించినప్పటి హడావిడి పూర్తిచేయడంలో లేకపోవడమే దీనికి కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. భీమిలి, బీచ్‌రోడ్డులో పైలాన్, వాటర్ ఫౌంటేయిన్, సెంట్రల్ లైటింగ్, బీచ్ వద్ద రక్షణగోడ నిర్మాణం వంటి అర్థాంతర పనులు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. బీచ్ రోడ్డుపొడుగునా సెంట్రల్ లైటింగ్‌కు పోల్స్ వేసినా, నేటికీ దీపాలు అమర్చలేదు. అయితే సదస్సు ముగిసిపోయిందిలే ఇంకెందుకని పనులన్నీ అరకొరగా వదిలేశారో? లేకుంటే నిధుల కొరత, లేక, విడుదలలో జాప్యమా? లేకుంటే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమా? లేకుంటే ప్రభుత్వం, అధికారుల నిర్వాకమా? కారణమేదైనా మైలురాయిగా నిలవాల్సిన జి20 సదస్సు సుందరీకరణ పనులు ఇపుడు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తూ నిర్వాహకుల చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులే సమాధానం చెప్పాలి.

బీచ్ రోడ్డులో సగంలోనే నిలిచిన రక్షణగోడ నిర్మాణ పనులు

నేరాలు ఘోరాలు

బీచ్‌లో మహిళ మృతదేహం

- పెదగంట్యాడకు చెందిన శ్వేతగా గుర్తింపు

-అత్తింటి వేధింపులే చావుకు కారణమంటున్న మృతురాలి తల్లి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం ఆర్‌కె.బీచ్‌లో వైఎంసిఎ సమీపంలో బుధవారం మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే మూడో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతురాలు పెదగంట్యాడకు చెందిన శ్వేతగా గుర్తించారు. శ్వేత మంగళవారం నుంచి కనబడకుండా పోయినట్టు న్యూ పోర్టు పోలీస్ స్టేషన్లో కేసు నమోదై ఉంది. ఆమె సూసైడ్ నోట్ రాసినప్పటికీ ఆమె శరీరంపై గాయాలుండటం, కేవలం లోదుస్తులు మాత్రమే ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్వేత భర్త మణికంఠ హైదరాబాదులో ఐటి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శ్వేత పెదగంట్యాడలో అత్తమామలతో కలిసి ఉంటుంది. మృతురాలు ఇంటి నుంచి బయలుదేరడానికి ముందు తన భర్తతో ఫోన్‌లో గొడవ పడిందని అత్తమామలు చెబుతుండగా, అత్తింటి వేధింపులు తట్టుకోలేక తమ కూతురు చనిపోయిందని శ్వేత తల్లి రమాదేవి ఆరోపిస్తున్నారు. పెళ్లైన నెల రోజుల నుంచి వేధింపులు ప్రారంభమయ్యాయని, నెల రోజుల క్రితం విడాకులు ఇస్తామని శ్వేతను ఆమె భర్త మణికంఠ బెదిరించాడని శ్వేత తల్లి పేర్కొన్నారు. తన కూతురు ఐదు నెలల గర్భిణి అని, అయినా కూడా కనికరించకుండా అత్తమామలో చిత్రహింసలు పెట్టే వారిని, తల్లిదండ్రుల చర్యలను కొడుకు సమర్థించే వాడని ఆరోపించారు.

వేర్వేరు చోరీ కేసుల్లో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖలో ఇటీవల జరిగిన ఐదు దొంగతనం కేసులలో ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.29 లక్షల విలువైన బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నామని నగర క్రైమ్ డిసిపి గంధం నాగన్న తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో కేసుల వివరాలను మీడియాకు తెలియజేశారు. పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధి సప్తగిరికాలనీలో 16 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు అయ్యల సోమయాజుల సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితుడు పత్తి దుర్గను బుధవారం కొమ్మాదిలో అరెస్టుచేసి, 16 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని నాగన్న తెలిపారు.

నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి సీతమ్మపేట, గురుద్వార్ ప్రాంతానికి చెందిన బండారు రవి ఈ నెల 18న శంకర్ మఠం రోడ్డులోని సువర్ణ సింబల్ ఎస్టేట్ పేరుతో నడుస్తున్న తన ఆఫీసులో రూ.9,05,000 విలువ గల బ్యాగు చోరీకి గురైనట్టు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ అనంతరం అదే ఆఫీసులో క్లర్క్‌గా పని చేస్తున్న వంటకు సూర్యనారాయణ (28)ను నిందితునిగా గుర్తించి రూ.9 లక్షలు రికవరీ చేశామని చెప్పారు.

నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 24, 25 తేదీల్లో, గత ఏడాది సెప్టెంబర్ 11న జరిగిన మూడు వేర్వేరు దొంగతనాలకు సంబంధించి నిందితుడు నల్ల స్వాతికుమార్ (30)ను అరెస్ట్ చేశామని, అతని నుంచి 225 గ్రాముల బంగారం, 400 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మధురవాడ : ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై దాడిచేసి, ఆమె మెడలోని బంగారు ఆభరణాలను చోరీ చేసిన కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం.పాలెం నేర విభాగపు సిఐ బి.రమేష్ తెలిపారు. వివరాలివి.

జివిఎంసి ఎనిమిదో వార్డు, క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న సప్తగిరి కాలనీలో అయ్యల సోమయాజుల సుబ్బలక్ష్మి అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఈనెల 24న దాహం కోసం మంచినీరు కావాలంటూ వచ్చిన పత్తి దుర్గ అనే మహిళ, ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి, ఆమె మెడలో ఉన్న ఆరున్నర తులాల బంగారు వస్తువులను తెంపుకుపోయింది. బాధితురాలి నుంచి ఫిర్యాదు అందుకుని ఎస్ఐ రంభ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు, కొమ్మాది కూడలిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కొమ్మాది పెట్రోల్ బంక్ వెనుకనున్న ఒక అపార్టమెంట్ వాచ్‌ఉమెన్ పత్తి దుర్గను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నేరాన్ని అంగీకరించిన నిందితురాలి నుంచి చోరీ నగలు ఆరున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.కాగా నిందితురాలు దుర్గ, గతేడాది సెప్టెంబర్ లోనూ తాను వాచ్‌ఉమెన్‌గా ఉన్న అపార్టుమెంట్‌లోనే ఎం.రామ అనే వ్యక్తి ఇంట్లో ఏడు తులాల బంగారాన్ని దొంగిలించిందని వెల్లడించారు. అప్పట్లోనూ చోరీ నగలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామని సిఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం ఉదయం స్థానిక పోలీసులు 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నాగేంద్రకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ప్లాస్టిక్ సంచులతో గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని, గంజాయి తరలిస్తున్న అల్లూరి జిల్లా హుకుంపేట మండలం వోల్డా గ్రామానికి చెందిన కొదమ సుధాకర్, తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన జయ సిలన్, అలీ మహమ్మద్‌ను అరెస్టు చేశారు. నిందితులను చోడవరం కోర్టుకు తరలించినట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు.

స్కూటీకి నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 53వ వార్డు డాక్టర్ జాకీర్‌హుస్సేన్ నగర్ వద్ద ఇంటి బయట పార్కింగ్ చేసిన స్కూటీకి గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టాడు. ఘటనలో బైక్ పూర్తిగా దగ్ధమైంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి.

స్థానికంగా వెల్డింగ్ పనులు చేస్తున్న షేక్‌మదీనా వలి మంగళవారం రాత్రి విధులు ముగించుకొని, ఇంటిముందు తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసాడు. బుధవారం అర్థరాత్రి దాటాక రెండు గంటల సమయంలో స్కూటీ నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సమీపంలో ఉన్న మరో రెండు బైక్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాలనీలో ఉన్న సిసి కెమెరా ఫుటేజీని పరిశీలించగా, గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ పోసి స్కూటీకి నిప్పు పెడుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి.. సిఐ బిఎండి ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెహ్రూ ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌పై సదస్సు

ప్రజాశక్తి- మధురవాడ : భారత్ అమెరికా దేశాల మధ్య మేధోపరమైన సహకారానికి ఇండో యుఎస్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా భారతీయ పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులకు అందిస్తున్న నెహ్రూ ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌పై బుధవారం గీతం వర్సిటీలో ప్రత్యేక సదస్సును నిర్వహించారు.

గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో యుఎస్-ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ భారతీయ వ్యవహారాల మేనేజర్ గాయత్రీ సింఫాల్ పాల్గొని,.భారతీయులకు బోధన, పరిశోధనలలో, విదేశీ భాషా విభాగంలో అందిస్తున్న వివిధ స్కాలర్‌షిప్‌ల వివరాలు, వాటికి కావలసిన అర్హతలు, దరఖాస్తు విధానం వంటి అంశాలపై అవగాహన కలిగించారు.

గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్, ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్ గ్రహీత ప్రొఫెసర్ నళినీ బిక్కిన తనకు లభించిన అవకాశాలను, గుర్తింపును వివరించారు. గీతం అదర్ కెరీర్ ఆప్షన్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ తమ విభాగం ద్వారా ఉన్నత విద్యావకాశాలతో పాటు దేశ,విదేశాలలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న స్కాలర్‌షిప్‌లపై అవగాహన కల్పించారు.

అనకాపల్లి ఎస్‌డిపిఒగా సుబ్బరాజు

పరవాడకు సత్యనారాయణ నియామకం

వి.సుబ్బరాజు

కెవి సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలో అనకాపల్లి, పరవాడకు ఎస్‌డిపిఒలను నియమిస్తూ డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఎసిబి డిఎస్‌పిగా పనిచేస్తున్న వి.సుబ్బరాజును అనకాపల్లి ఎస్‌డిపిఒగా నియమించారు. గంజాయి నిందితుడి కారు వినియోగించారన్న అభియోగాలపై గతంలో అనకాపల్లి ఎస్‌డిపిఒగా పనిచేసిన బి.సునీల్‌ను డిజిపి కార్యాలయానికి అటాచ్ చేయడంతో అనకాపల్లి దిశ పోలీసు స్టేషన్ డిఎస్‌పి మళ్ల మహేష్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ స్థానంలో అనకాపల్లి ఎస్‌డిపిఒగా సుబ్బరాజును నియమించారు. పశ్చిమగోదావరి జిల్లాలో దిశ పోలీసు స్టేషన్ డిఎస్‌పిగా పనిచేస్తున్న కెవి సత్యనారాయణను పరవాడ ఎస్‌డిపిఒగా నియమించారు. ఇంతవరకు పరవాడ ఎస్‌డిపిఒగా ఎస్‌సి, ఎస్‌టి విభాగం డిఎస్‌పి శ్రీనివాసరావు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డిజిపి కార్యాలయానికి అటాచ్ చేసిన సునీల్‌కు విశాఖపట్నం క్రైమ్స్ ఎసిపిగా పోస్టింగ్ ఇచ్చారు.

మానవతావాది వానపల్లి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మాజీ కార్పొరేటర్, టిడిపి సీనియర్ నాయకుడు వానపల్లి రవికుమార్ గొప్ప మానవతావాది అని పలువురు కొనియాడారు. రవికుమార్ ద్వితీయ వర్ధంతిని బుధవారం టిడిపి కార్యాలయంలో రాష్ట్ర పద్మశాలి సాధికారిక సభ్యుల ఆధ్వర్యాన నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టిడిపి పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీ భరత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వానపల్లి పప్పు శ్రీనివాసరావు, నేమాల పెంటయ్య, బండి నీలకంఠం, గిడుతూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల సత్తా

మారికవలస గిరిజన గురుకులంలో 98శాతం ఉత్తీర్ణత

శ్వేతకుమారి (977) దీప్తి ఫ్లోరెన్స్ (976) మేఘన (958)

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఇంటర్ ఫలితాలలో మారికవలస ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా పాఠశాల గిరిజన బాలికలు సత్తాచాటారు. 98 శాతం ఉత్తీర్ణతతో మేటి అనిపించుకున్నారు. గురుకులం ప్రిన్సిపాల్ డి. లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం 81మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 80 మంది ఉత్తీర్ణులైనారు. యంపిసిలో వంజారి శ్వేత కుమారి 977, సోమెల దీప్తి ఫ్లోరెన్సు 976 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలవగా, బైపిసిలో బొడ్డ మేఘన 958 మార్కులు సాధించింది. 11మంది విద్యార్థులు 950కి పైగా , 22 మంది విద్యార్థులు 900 పైగా మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 81మంది విద్యార్థులకు 76 మంది ఉత్తీర్ణత సాధించి 94 శాతం సాధించారు. , యం.పి.సి లో పత్తిక శ్రావ్యలక్ష్మి 457, కొట్టిక దీపిక 457 మార్కులు, సెగ్గి తేజస్విని 450 మార్కులు , బైపిసిలో తగ్గి బిందులోవ మాధవి 419 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు . ఫస్టియర్‌లో 20 మంది విద్యార్థులు 400లకు పైగా మార్కులతో మారికవలస గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా పాఠశాల సత్తాను చాటారు. విద్యార్థులను గురుకులం ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు అభినందించారు.

భీమిలి కెజిబివిలో 78 శాతం ఉత్తీర్ణత

పి లహరి (960 మార్కులు)

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిలో ఇంటర్ సెకెండియర్ పరీక్ష ఫలితాల్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. 32మంది పరీక్ష రాయగా, 25మంది పాసయ్యారన్నారు. ఇందులో పోలిరెడ్డి లహరి 960 మార్కులు, ఐ ధనలక్ష్మి 947 మార్కులు, పైలా పూజిత 946 మార్కులు సాధించినట్లు వివరించారు. ఐదుగురి విద్యార్థులకు 900పైబడి మార్కులు వచ్చాయని తెలిపారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో 63.24 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇంటర్ ఫలితాలలో ఆరిలోవ శ్రీకృష్ణాపురం డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 63.24 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తెలియజేసారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 46.77 శాతం, ద్వితీయ సంవత్సరం 63.24 శాతం విజయం సాధించినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో పిక్కి ప్రసాద్ 426 మార్కులు, కె. అరవింద్ 423 మార్కులు, ఎస్.జ్ఞానేశ్వర రావు 402 మార్కులు సాధించారు. సెకెండ్ ఇంటర్‌లో జాన్ తిమోతి 948 మార్కులతో మొదటి స్థానం, వై దీపక్ 936 మార్కులతో ద్వితీయ స్థానం సాదించారన్నారు. విద్యార్థులకు పాఠశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీశ్రీ జీవితంపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ రసజ్ఞ వేదిక సంస్థ ప్రతినిధులు ద్వయం డాక్టర్ డి.వి.సూర్యారావు, మేడా మస్తాన్ రెడ్డి నేతృత్వంలో పౌర గ్రంథాలయంలో శ్రీశ్రీ జీవితం సమగ్ర సాహిత్యంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. బుధవారం సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో బి.మణినాగేంద్రరావు మొదటి బహుమతికి ఎంపికకాగా, ద్వితీయ బహుమతికి శేఖరమంత్రి ప్రభాకరరావు, దుర్గా ప్రసన్న, డాక్టర్ మరడాన సుబ్బారావు ఎంపికయ్యారు.

జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతికి బివి.రామకృష్ణ, ద్వితీయ బహుమతికి పి.సురేశ్‌కుమార్ ఎంపికయ్యారు. విజేతలకు ఈ నెల 30న సాయంత్రం ఐదున్నర గంటలకు అమ్మాసా హాలులో నిర్వహించే శ్రీశ్రీ జయంతి వేడుకల్లో నగదు బహుమతులను అందజేస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గండికోట రఘురామారావు తెలిపారు.

కృష్ణమూర్తి, సుబ్బారావు కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - ఆరిలోవ : గుండెపోటుతో ఈ నెల 19న మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు వి.కృష్ణమూర్తి కుటుంబాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పరామర్శించారు. బుధవారం ఆరిలోవలోని కృష్ణమూర్తి ఇంటికి వెళ్లి ఆయన భార్య అన్నపూర్ణ, కుమార్తె శార్వాణి, కుమారుడు మోహన్, అల్లుడు కృష్ణ, కోడలు లావణ్యలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణమూర్తి మరణ వార్త తనకు ఆలస్యంగా తెలిసిందని ఆవేదన వెలిబుచ్చారు. విశాఖకు ఎప్పుడు వచ్చినా తనను ఎంతో ఆప్యాయతగా చూసేవారని గుర్తు చేసారు. విశాఖ జిల్లా సిపిఎం కార్యాలయంలో అకౌంట్స్ నిర్వహణను ఎంతో బాధ్యతతో నిర్వహించారని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా జీవనం సాగించిన కృష్ణమూర్తి, తమ పిల్లలిద్దరికీ కులాంతర వివాహాలు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. మరణానంతరం తన కళ్లను దానం చేశారని, దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం ఆంధ్రామెడికల్ కాలేజీకి ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కృష్ణమూర్తి మరణం వారి కుటుంబానికే కాకుండా పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. శ్రీనివాసరావు వెంట సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి. కుమార్, జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాఘవులు, నరసింగరావు

కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

గాజువాక : ఈనెల ఒకటిన మరణించిన సిపిఎం సీనియర్ నాయకులు, కార్మికనేత జి.సుబ్బారావు కుటుంబాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి. రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు పరామర్శించారు. బుధవారం షీలానగర్‌లోని సుబ్బారావు ఇంటికి వెళ్లి ఆయన సతీమణి, మహిళా సంఘం నేత జి.మణి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బారావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మణి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కుమారులు, వారి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విశాఖ ఉద్యమంలో జి.సుబ్బారావుతో కలిసి పనిచేసిన అనుభవాన్ని, స్మృతులను నెమరువేసుకున్నారు. సుబ్బారావు మృతి జిల్లా కార్మికోద్యమానికి, కుటుంబానికి తీవ్ర లోటన్నారు.

అలాగే ఇటీవల తీవ్ర అనారోగ్య పాలై తల్లిని కోల్పోయిన పార్టీ జిల్లా సెక్రెటేరియట్ సభ్యులు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, కాలుకు ఆపరేషన్ చేయించుకున్న పార్టీ సీనియర్ నేత కె.స్వతంత్ర కుమార్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కమలమ్మలను పరామర్శించారు. అనంతరం కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న అమృతవల్లిని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా నేతలు ఎం.రాంబాబు, వై.సత్యవతి, జి.రమణ, ఒ.అప్పారావు, అప్పలరాజు, సోమేశ్వర్, యుఎన్ఎన్.రాజు, ఈశ్వరరావు, గౌరీష్, ఎ.నూకేశ్వరరావు, డి. అప్పారావు, జయలక్ష్మి పున్నారు.

యుఎల్‌సి పట్టాలకు పూర్తి హక్కులు

పట్టాల్లో సవరణ, శ్లాబ్ విధానంలో రిజిస్ట్రేషన్‌కు ఛాన్స్

కరెక్షన్ మాడ్యూల్ ప్రారంభించిన జెసి విశ్వనాథన్

కరెక్షన్ మాడ్యూల్ ప్రారంభిస్తున్న జెసి విశ్వనాథన్

ప్రజాశక్తి - కరాస : యుఎల్‌సి భూములలో ఇల్లు కట్టుకుని, గతంలో పట్టాలు పొందిన లబ్దిదారులు కన్వేయన్స్ డీడ్ పొందుటకు, అలాగే పట్టాల్లో సవరణలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అన్నారు. బుధవారం గోపాలపట్నం మండలంలోని 52వ వార్డు సచివాలయంలో దీనికి సంబంధించి కరెక్షన్ మాడ్యూల్ అప్లికేషన్ ప్రారంభించి, వచ్చేనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, గతంలో జిఓ 301, 388 ద్వారా పట్టాలు పొందిన హక్కుదారులు కన్వేయన్స్ డీడ్ పొందేందుకు, పట్టాల్లో మార్పులు చేర్పులకు ప్రభుత్వం సవరణ జిఒలు 71,72 ఆర చేసిందన్నారు. గతంలో పట్టాలు పొంది, అవసరానుకూలంగా వాటిని అమ్ముకోవడానికి, బదలాయింపునకు వీలులేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడ్డ లబ్దిదారులకు ఇదొక మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలాగే యుఎల్‌సి భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి శ్లాబ్ విధానంలో కన్వేయన్స్ డీడ్ పొందుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. 150 గజాలలోపున్న లబ్దిదారులకు డీపట్టా ఇచ్చి, పదేళ్ల తర్వాత పూర్తి హక్కులు కల్పిస్తారన్నారు. 150 నుంచి 300 చదరపు గజాల వరకు 15శాతం కన్వేయన్స్ ఫీజుతోను, 300 నుంచి 500 గజాల వరకు 30శాతం ఫీజు, 500 చదరపు గజాలకు పైబడి ఉన్న స్థలాలకు వందశాతం కన్వేయన్స్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, దీనికి ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్నవారు సమీప సచివాలయంలో దరఖాస్తు పొంది వినియోగించుకోవాలని సూచించారు.

విజేతలకు బహుమతులు అందజేత

విజేతలకు బహుమతులు ఇస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి -ములగాడ : ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో మల్కాపురం శివారు ప్రకాష్‌నగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన మేఘన, తిలక్‌లకు బుధవారం జిల్లా, జివిఎంసి మలేరియా సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం ఎల్ అరుణకుమారి బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా మలేరియా సిబ్బంది మాట్లాడుతూ, జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మణి ఆదేశాల మేరకు నోడల్ అధికారి నాగశ్రీను పర్యవేక్షణలో పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి రవికుమార్, జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్లు డి రాజ్‌కుమార్, రోమాల వేణుబాబు, సూపర్‌వైజర్ డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అశనిపాతంగా 60ఏళ్ల నిబంధన!

ఉద్యోగమొచ్చినా నిరుద్యోగులుగా మిగిలిపోయాం!

డిఇఒ కార్యాలయం వద్ద డిఎస్‌సి98 అభ్యర్థుల ఆందోళన

డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్నడిఎస్‌సి 98 అభ్యర్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : డిఎస్‌సి 1998లో ఉత్తీర్ణులై, ఉద్యోగానికి అర్హత సాధించినా 60 ఏళ్ళు పైబడ్డ వారికి ఉద్యోగం కల్పించక పోవడంతో తిరిగి తామంతా నిరుద్యోగులుగా మిగిలిపోయామని డిఎస్‌సి-98 అభ్యర్థులు వాపోతున్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం జిల్లా విద్యాశాఖాధికారిణి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. డిఇఒకు వినతిపత్రం అందించారు. డిఎస్‌సి 1998లో అర్హులైన అభ్యర్థులకు ఇటీవల ఎంటిఎస్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2023 మార్చి 15 నాటికి 60ఏళ్లలోపున్న వారికే ఉద్యోగాలిచ్చారు. దీంతో 60ఏళ్ల నిబంధనలతో డిఎస్‌సిలో అర్హులైనప్పటికీ, జిల్లా సుమారు 40 మంది మళ్లీ నిరుద్యోగులుగా మిగిలి పోయారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మానవతా దృక్పథంతో అవకాశం కల్పిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం, 60ఏళ్ల వయస్సు నిబంధన పెట్టడంతో తామంతా ఉద్యోగార్హత కోల్పోయి, నిరుద్యోగులుగానే మిగిలి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లుగా పెంచిన ప్రభుత్వం, డిఎస్‌సి 98 అభ్యర్థులకు మాత్రం 60ఏళ్ల నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు. అప్పట్లో తమకు అన్యాయం జరగకపోతే, ప్రస్తుతం 62ఏళ్ల వరకు ఉద్యోగంలోనే ఉండేవారమన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని తమకు న్యాయం చేయాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో తమను భర్తీ చేయాలని కోరారు.

టీచర్లను భయభ్రాంతులకు గురి చేయడం తగదు

ఫ్యాప్టో ఆధ్వర్యంలో స్పాట్ కేంద్రాల వద్ద నిరసన

విశాఖపట్నం స్పాట్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయడం తగదని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గొంది చిన్నబ్బాయి అన్నారు. స్థానిక స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద బుధవారం భోజన విరామ సమయంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ రాష్ట్రమంతా పర్యటిస్తూ ఎక్కడికక్కడ అధికారులను, ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ లోపాలను ఉపాధ్యాయులపై నెట్టి వేయడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయకుండా, ఆ తప్పిదాన్ని ఉపాధ్యాయులు, అధికారులపై నెట్టడంతో ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇచ్చిన నెలలోనే జగనన్న స్కూల్ బ్యాగులు చినిగిపోయాయని, పాదరక్షలు సరైన కొలతలతో రాలేదని, ఈ విషయంలో ప్రవీణ్ ప్రకాష్ ఎవరిని శిక్షిస్తారని ప్రశ్నించారు. ప్రవీణ్ ప్రకాష్ తీరు మార్చుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సుధాకర్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పట్ల కక్ష సాధింపు ధోరణి విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కో చైర్మన్ సాయికుమార్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్ సన్యాసినాయుడు, కే రమణాజీ, కోశాధికారి కె.పరదేశి, కార్యవర్గ సభ్యులు ఎం శ్రీనివాసరాజు, కే రాజు, సీనియర్ నాయకులు జి మధు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనకాపల్లి స్పాట్ కేంద్రంలో వద్ద మాట్లాడుతున్న చిన్నబ్బాయి

కలెక్టరేట్, విశాఖ : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల పర్యవేక్షణ సందర్భంగా ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ క్వీన్ మేరీ పాఠశాలలో స్పాట్‌కు హాజరైన ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను తీవ్రంగా ఖండించారు. ప్రిన్సిపల్ కార్యదర్శి వ్యవహార శైలిని తప్పుపడుతూ నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి నాగేశ్వరరావు, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, టి.రామకృష్ణ, డిటిఎఫ్ కో– చైర్మన్ ఎ.ధర్మేందర్‌రెడ్డి, ఎస్‌టియు డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఐవి రామిరెడ్డి, ఫ్యాప్టో కార్యదర్శి ఎం.కృష్ణ నాయకత్వం వహించారు.

వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని పిసినిగాడ పంచాయతీ పరిధి బిఆర్‌టి నగర్‌లో రూ.25.50 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను బుధవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులు అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని, అత్యవసర మందులను ఆసుపత్రిలో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల ముంగిటికే ఆరోగ్య సేవలను తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, పిసినికాడ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

5 నుంచి ఉచిత తైక్వాండో శిక్షణ

ప్రజాశక్తి-వడ్డాది

అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల పిల్లలకు తైక్వాండో వేసవి ఉచిత శిక్షణ శిబిరం మే నెల 5 నుండి 20వ తేదీ వరకు వడ్డాది హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6 నుండి 7గంగల వరకు తైక్వాండో శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని వడ్డాది పరిసర ప్రాంత విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదేళ్ల నుండి 16 సంవత్సరాల వయస్సు గల విద్యార్థిని, విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన వచ్చని, శిక్షణ ముగిసిన తరువాత సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అమ్మ హెల్పింగ్ హార్ట్ ప్రతినిధులు తెలిపారు. రిజిస్ట్రేషన్ వివరాల కోసం 9505394884, 8099222215, 9966168540 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - కశింకోట : మండల కేంద్రం కశింకోటలో బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ మాట్లాడుతూ మానవ మనుగడకు కంటి చూపు ప్రధామని చెప్పారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

తురకలపూడి పిఎసిఎస్ అధ్యక్షునిగా నాగభూషణం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి పిఎసిఎస్ అధ్యక్షునిగా నూతనంగా ఎంపికైన బుదిరెడ్ల నాగభూషణం బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ తురకలపూడి పిఎసిఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలని, రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

నాగభూషణాన్ని గజమాలతో సత్కరిస్తున్న ధర్మశ్రీ తదితరులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

'సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తాం'

ప్రజాశక్తి - యలమంచిలి : నియోజకవర్గంలో ఎక్కడైనా, ఏ ప్రాంతంలోనైనా సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని స్థానిక ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి 12, 13 వార్డుల్లో చైర్‌పర్సన్ రమాకుమారితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగా ధర్మవరంలో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 63 కెవిఎ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి గోవిందరావు, వైసిపి టౌన్ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కొఠారు కొండబాబు, మున్సిపల్, విద్యుత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని పాలించే అర్హత జగన్‌కు లేదు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రాష్ట్రాన్ని పాలించే అర్హత వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి లేదని జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలు, అక్రమాలకు చోటుచేసుకున్నాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ప్రవర్తన సరిగా లేదన్నారు. నిర్వాసితులు, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోవడం లేదని చెప్పారు. వెంకటాపురం జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభోత్సవానికి పార్టీ నాయకులు కొణిదెల నాగబాబు విచ్చేస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు పైల రామానాయుడు, బి రాందాసు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము అన్నారు. రుషిల్ డెకార్ ప్లైవుడ్ పరిశ్రమ ముఠా కార్మికులు 22 రోజుల పాటు పోరాటం చేసి విజయం సాధించిన నేపథ్యంలో బుధవారం ఆందోళన శిబిరం వద్ద విజయోత్సవం నిర్వహించారు. కార్మికులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కలిసి ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రుషిల్ డెకార్ యాజమాన్యంపై ఐక్యంగా పోరాడి విజయం సాధించిన నిర్వాసితులు, ముఠా కార్మికులకు జేజేలు పలికారు. ఏ అన్యాయం జరిగినా ఇదే స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఎస్ఇజెడ్‌లో నిర్వాసితులు తమ భూములను కారు చౌకగా ఇచ్చారని, పరిశ్రమలు వస్తే తమ జీవితాలు బాగుపడతాయని ఆశించారని తెలిపారు. కాని నేడు ప్రభుత్వం, యాజమాన్యాలు బయటకు పంపే చర్యలకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పన వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకుల దయాదాక్షిణాలపై కాకుండా ఎపిఐఐసి ట్రైనింగ్ సెంటర్ ద్వారా భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అందె సూరిబాబు, కిషోర్, చొప్ప వెంకన్న, నానాజీ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

స్వీట్లు తినిపించుకుంటున్న ముఠా కార్మికులు

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను పేదలకు పంపిణీ చేయాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. నాలుగేళ్లయినా నేటికీ ఇళ్లను కేటాయించకపోవడం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అసమర్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. బుధవారం ఆయన టిడ్కో గృహాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యనారాయణపురం పంచాయతీలో 2520 గృహాలను టిడిపి నిర్మించిందని, వాటికి వైసీపీ ప్రభుత్వం రంగులు వేసింది తప్ప అర్హులైన లబ్ధిదారులకు అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి లబ్ధిదారులకు ఇళ్లు అందే వరకు పోరాటం చేస్తామన్నారు.

టిడ్కో గృహాలను చూపుతున్న నాగజగదీశ్వరరావు

సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్‌లో నిలదీత



సిఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం బూడి

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- దేవరాపల్లి : వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు బుధవారం తారువలోని తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. వి.మాడుగుల మండలం, ఎం.కోడూరు గ్రామానికి చెందిన చింత సోమేశేశ్వరరావు అనారోగ్యంతో ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా, సోమేశేశ్వరరావు వైద్యానికి అయిన ఖర్చు లక్ష రూపాయలు మంజూరు చేశారు. ఈ చెక్‌ను బుధవారం సోమేశేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఉప ముఖ్యమంత్రి అందజేశారు.

'తుమ్మపాల'ను తెరిపించకుంటే రాజీనామా చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేతనైతే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని, లేకుంటే రాజీనామా చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఫ్యాక్టరీని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ 13 వేల మంది రైతుల కన్నీళ్లు మంత్రి అమర్నాథ్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ ఆస్తులను మంత్రి అమరనాథ్ కొల్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ ఆధునికీకరిస్తామని జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం

ప్రజాశక్తి-కశింకోట : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తున్నట్లు అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి ఎద్దడి నివారణకు బోరుబావుల కోసం రూ.13 లక్షలు విడుదల చేసినట్లు వెల్లడించారు. మండలంలోని అడ్డాం, పేరంటాల పాలెం, జోగారిపేట, నాయుడు పాలెం, ఏయస్ పేట, జమాదులపాలెం, తేగాడ, లాలంకొత్తూరు గ్రామాల్లో శ్మశాన వాటికల్లో బోరుబావుల కోసం రూ.9 లక్షలు విడుదల చేసినట్లు వెల్లడించారు.

పేదలకు సొంతింటి నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : అర్హత ఉన్న ప్రతి పేదవానికి సొంత ఇంటిని నిర్మించి ఇవ్వడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని హౌసింగ్ శాఖ ఈఈ చిరంజీవి అన్నారు. మండలంలోని పాపయ్య సంతపాలెంలో లేఅవుట్లను పరిశీలించారు. లేఅవుట్లలో లబ్ధిదారులకు స్థలాలను కేటాయించడంతోపాటు దశలవారీగా ఇళ్ల నిర్మాణం కూడా చేపడుతున్నామని చెప్పారు. లేఅవుట్‌లో 40 అడుగుల రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిఈ ఏడుకొండలు, హౌసింగ్ శాఖ ఏఈ ప్రియాంక, లేఅవుట్ ఇన్‌ఛార్జి నాయక్ పాల్గొన్నారు.

అభయాంజనేయ తీర్థానికి రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని కింతాడ శివారు మెరక రామచంద్రపురం గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవానికి టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైల ప్రసాదరావు మంగళవారం రాత్రి ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి దైవ కార్యక్రమాలు గ్రామస్తులందరూ ఏకమై జరుపుకోవడం శుభ పరిణామమన్నారు. టిడిపి నాయకులు బండారు నరసింహనాయుడు, కర్పూరు సూర్యనారాయణ, బండారు అక్కునాయుడు, కొండ్రపు శ్రీను, బొడ్డు నాగరాజు, కొండ్రపు బొంగు నాయుడు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు

సమన్వయంతో పరిష్కరించాలని చైర్‌పర్సన్ రమాకుమారి ఆదేశం

ప్రజాశక్తి - యలమంచిలి

'యానాద్రి కాలువ పూడిక తీత పనుల గురించి ఎంతో కాలంగా ప్రశ్నిస్తున్నప్పటికీ పరిష్కారం లభించలేదు. ఇటీవల అధికారుల రిపోర్టుల్లో పనులు పూర్తి చేసినట్లు చెబుతున్నారు. ఆ పనులు ఎప్పుడు చేశారు? ఎవరు చేశారు' అని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెప్పు గుప్తా అధికారులను ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లకు మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. పుస్తకాలు చూసి చెబుతామని అధికార్లు చెప్పడం పట్ల కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. వీధిలైట్లు కోసం సొంత ఖర్చుతో వేసుకున్న స్తంభాలకు లైట్లు బిగించడంలో ఇంజనీరింగ్ అధికార్లు అలసత్వం వహిస్తున్నారని కౌన్సిలర్ అచ్యుతరావు ఆరోపించగా, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ఇంజనీర్ సునీల్ సమాధానమిచ్చారు. ఇదంతా విన్న చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ ప్రతి నెలా సమావేశాలు జరుగుతున్నా కౌన్సిలర్లు, అధికారుల మధ్య సమన్వయం లోపం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పాలెంలో మున్సిపల్ స్థలంలో అక్రమంగా మొక్కలు వేసి ఆక్రమించడంపై చర్యలు చేపట్టాలని దాసరి కుమార్ కోరగా అడ్డంగా కంచె నిర్మాణం జరుగుతుందని తెలిపారు. కుక్కలు, కోతులు ప్రజల్ని ఇబ్బంది పెడుతున్న సమస్య కౌన్సిల్ ముందుకు వచ్చినపుడు బడ్జెట్ కేటాయింపు గురించి ఆరా తీశారు. సమస్య త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని కమిషనర్ జవాబిచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త మోటారు ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు ఇంజనీరింగ్ అధికార్లు తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో సులాభ్‌కాంప్లెక్స్‌ల నిర్మాణం చేయాలని చైర్ పర్సన్ కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, ఎంఐ వీరయ్య, ఏఇలు, ఆర్ఐ, మేనేజర్ ప్రభాకరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

డస్ట్ అలవెన్స్ పెంచాలని

ఎన్‌టిపిసి మెయిన్ గేటు వద్ద ధర్నా

ప్రజాశక్తి -పరవాడ

పరవాడ సింహాద్రి ఎన్టీపీసీలో కాంటాక్ట్ కార్మికులకు డస్ట్ అలవాన్స్ పెంచుతూ వెంటనే అగ్రిమెంట్ చేయాలని కోరుతూ ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌టిపిసి సింహాద్రి మెయిన్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌టిపిసిలో డస్ట్ అలవెన్స్ సమస్య సంవత్సరాల తరబడి పెండింగ్లో పెట్టడం దుర్మార్గమన్నారు. మెడికల్ టెస్టు పేరుతో వేధింపులు గురి చేయడం, డ్యూటీ నుండి నిలిపివేయడం అన్యాయమన్నారు. కార్మికులకు ఇచ్చే ఐడి కార్డుల్లో ఎన్టిపిసి లోగో తొలగించడం, కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం చులకనగా చూడడం దారుణమన్నారు. ఎన్టిపిసిలో ఉన్న అన్ని యూనియన్లతో యాజమాన్యం సమావేశం ఏర్పాటు చేసి డస్ట్ అలవెన్స్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పి.పి.నాయుడు, ఉపాధ్యక్షులు పి.గోవిందరాజు, వి.అప్పారావు, బి.కన్ననాయుడు, ఎం.లోవరాజు, కె.సన్నిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మికులు

నివాళులర్పిస్తున్న సిపిఐ, సిపిఎం నాయకులు

సిపిఐ సీనియర్ నాయకుడు ఆడారి అప్పారావు మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఐ సీనియర్ నాయకులు ఆడారి అప్పారావు బుధవారం మండలంలోని వెంకుపాలెం గ్రామంలో తమ స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, నాయకులు వైఎన్ భద్రం, రాజాన దొరబాబు, సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, కాళ్ళ తేలయ్య బాబు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ అప్పారావు సిపిఐ అనకాపల్లి రూరల్ జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి విశాఖ జిల్లా సమితి సభ్యునిగా పలు పదవులు చేపట్టారని తెలిపారు. రైతు సంఘం నాయకుడుగా అనేక రైతు సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహాన్ని పార్టీ నాయకులు శ్మశానం వరకు మోశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, జి.గురుబాబు, చెల్లూరి నాగరాజు, వియ్యపు రాజు, కొండూరు రవీంద్ర పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో కానరాని అభివృద్ధి

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, వైసీపీ హయాంలో ఎక్కడా అభివృద్ధి పనులు కానరాలేదని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఎద్దేవా చేశారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గండి రవికుమార్, మిడతాడ మహలక్ష్మి, నాయుడు, గండి ముత్యాలనాయుడు, కోటాన అప్పారావు, రేసుపూడి రమణ సబ్బవరం సర్పంచ్ డి.ప్రసాద్, డి.దేముడు, ఎంపీటీసీ ఎస్.అప్పలరాజు, చైతన్య, అక్కిరెడ్డి రామలక్ష్మీ దుర్గి నాయుడు, గవర అప్పారావు, కోరాడ శ్రీను, గవర సత్యనారాయణ, బి.ప్రసాదు, బి.అప్పారావు, సురేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కుంచంగి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తమ పార్టీ నాయకులు కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, కాలువలు, మంచినీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన వికలాంగుడు తనకు మూడు చక్రాల వాహనం కావాలని కోరగా త్వరలోనే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పొట్టి దొరపాలెం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలన్ని పరిశీలించారు. చిన్నారులను ఆటపాటలతో ఉత్సాహపరిచారు. గర్భిణులు, బాలింతలకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, పార్టీ నాయకులు కోలిమెల అచ్చంనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - అనకాపల్లి : టిబి వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదాబాయి అన్నారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహార పంపిణీకి దాతలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ ఎన్ వాణి జగదీశ్వరి, కే సుమేధ మేఘన, సి హెచ్ఓ శారద, ఎంపి హెచ్ఈవో జె. శ్రీనివాసరావు, ఎంపి హెచ్ ఎస్ బి సంగం, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ ఎం పెంటయ్య, ఫార్మసిస్ట్ సత్య సుధా, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తున్నారని సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్ అన్నారు. తుమ్మపాల గ్రామ సచివాలయం-1లో బుధవారం జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ సభ్యులు పంచదారల కన్నారావు, వడ్డాది భారతి అశోక్, వార్డు మెంబర్లు నాగరాజు, వెలగా మోది నాయుడు, వీఆర్వో దుర్గాప్రసాద్, రైతు నాయకులు పీలా బుజ్జి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బండారుకు హారతి పడుతున్న మహిళలు

అక్రమంగా చెరువుల్లో మట్టి తరలింపుపై సభ్యుల ఆగ్రహం

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండల సర్వ సభ్య సమావేశం వాడివేడిగా సాగింది. బుధవారం ఉదయం డల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపిపి కోన లోవలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశంను ఎంపిడివో రామచంద్రమూర్తి ప్రారంబించగా, జెడ్పీటిసి కాకర దేవి మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తాము తెలిపే సమస్యలపై అధికారులు స్పందించ లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలకు తాము సమాధానం చెప్పలేని స్థితిలో వున్నామన్నారు. అధికారులే మాట వినకపోతే తాము ఎందుకు ప్రజాప్రతినిధులుగా ఎందుకున్నామో తెలియలేదన్నారు. దీనికి సమాధానమిచ్చిన ఎంపిడివో రామచంద్రమూర్తి తెలుపుతూ నిబంధనలకు వ్యతిరేకంగా ఏ పని చేయలేదని తెలిపారు. అధికారులు ఎవరు స్పందిచలేదనేది రాతపూర్వకంగా తెలియపరిస్తే వారి నుండి వివరణ కోరుతామన్నారు. అనంతరం ఇరిగేషన్ శాఖ సమీక్షలో సర్వసిద్ధి, వాకపాడు చెరువుల్లో రాత్రి సమయాల్లో అక్రమ మట్టి తవ్వకాలపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయగా, త్వరలోనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. తహాశీల్దారు శ్యామ్ కుమార్ తమ శాఖ ప్రగతిని తెలిపారు. గుడివాడ పంచాయితీ నుండి విడివడిన కొత్తరేవుపోలవరం గ్రామ సరిహద్దులు నిర్ణయించి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ మల్లె లోవరాజు విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బొలిశెట్టి శారదా కుమారి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తున్న సభ్యులు

కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

సంపద కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనబాలవానిపాలెం వద్ద నిర్మించిన సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్డి వెంకటనారాయణ సందర్శించారు. కేంద్రానికి సంబంధించి మిగిలిన పనులను పూర్తి చేసి, వెంటనే వాడుకులోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి జయ ప్రకాష్‌కు సూచించారు. సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి వస్తే గ్రామాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా,పంచాయతీకి ఆదాయం లభిస్తుందన్నారు. సచివాలయ సేవలపై ఆరా తీశారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తిబాబు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి హాజరైన వైద్యులు

పలు చోట్ల వైద్య శిబిరాలు

గొలుగొండ:మండలంలోని కంతారం పంచాయతీలో సర్పంచ్ బిడిజన రాజేశ్వరి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి అశ్విని శైలజ సుమారు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

యస్.రాయవరం:మండలంలోని తీర ప్రాంత గ్రామమైన రేవుపోలవరంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు పెనుగొల్లు వైద్యాధికారి రాజేశ్వరి తెలిపారు. బుధవారం ఉదయం రేవుపోలవరం గ్రామంలో అనకాపల్లి జిల్లా వైద్యాధికారి మానస నేతృత్వంలో జరిగిన మెడికల్ క్యాంపులో కిడ్నీ క్రియోటన్స్, కేన్సర్, బిపి, షుగర్ థైరాయిడ్‌లకు ఉచితంగా మందులు అంద చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, గ్రామసర్పంచ్ చోడిపల్లి గోవిందు, సామాజిక కార్యకర్త గనగళ్ళ రాంబాబు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఈవో శ్రీనువాసరావు, హెచ్ఎస్ సాయి, హెల్త్ అసిస్టెంట్ దేవరాజ్ పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

ప్రజాశక్తి-రోలుగుంట:కుసర్లపూడి గ్రామంలో డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రోలుగుంట మండల ప్రధాన కార్యదర్శి పచ్చిగోళ్ళ ఈశ్వరరావు కోరారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు స్పందనలో దరఖాస్తులు సమర్పించామన్నారు.వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

సెల్ఫీలతో నేతల ఆరోపణలు

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్రంలో అభివృద్ధి, నిర్లక్ష్యం, విధ్వంసం, దారుణాలు వంటి వాటి వద్ద నాయకులు సెల్ఫీలు తీసుకుని ఆరోపణలు గుప్పించుకుంటున్న ఫోటోలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అధికార ప్రతిపక్ష పార్టీ నాయకులు సోషల్ మీడియా, సహా ప్రసార మాధ్యమాలతో పాటు దినపత్రికల వేదికగా చేసుకొని విమర్శ ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. ఈ సెల్ఫీ సాంప్రదాయం ఇప్పుడు మండలాలకు చేరింది. మండలంలో బికే పల్లి గ్రామ సర్పంచ్ లింగన్ననాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, ఒకరినొకరు అభివృద్ధి, నిర్లక్ష్యంపై సెల్ఫీలు తీసుకుని బుధవారం మీడియా ద్వారా విమర్శలు ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన గ్రామ సర్పంచ్ లింగన్న నాయుడు గ్రామంలో అసంపూర్తిగా వదిలేసిన కమ్యూనిటీ బిల్డింగ్ తో పాటు పారిశుధ్య నిర్వహణ కై నిధులు కేటాయించక పోవడం పట్ల సెల్ఫీ ద్వారా విమర్శించారు. ఎంపీటీసీ సభ్యులు రాంబాబు కోటి 50 లక్షలతో దీర్ఘకాలిక సమస్యగా ఉన్న రోడ్డు నిర్మాణం పనులు, సచివాలయ భవనం, నాడు నేడు పాఠశాల అభివృద్ధి పనులుపై సెల్ఫీ ద్వారా సవాళ్లు విసిరారు. దీంతో ఈ అంశం మండల వ్యాప్తంగా హాట్ టాపిక్ మారింది.

భవనాన్ని చూపుతున్న సర్పంచ్

రోడ్డును చూపుతున్న ఎంపిటిసి

చెరువు పనుల పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో చేపడుతున్న చెరువుల సుందరీకరణ పనులను బుధవారం ఈఓపిఆర్డి ప్రేమ్ సాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో పాములవాక, జల్లూరు గ్రామాలకు సంబంధించి చెరువులను సుందరీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. పంచాయితీ సాధారణ నిధుల నుండి పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు చెరువులను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. కాగా చెరువులు శుభ్రపరిచే సమయంలో అధికంగా మద్యం సీసాలు, బీరు సీసాలు దర్శనమిస్తూ ఉండడం విశేషం.

పరిశీలిస్తున్న ఈఓపిఆర్‌డి

కూలీలకు వసతులు కల్పించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రోజా రమణి సూచించారు. బుధవారం ఆమె ఉపాధి భవనంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతిరోజు సగటున వేతనం రూ.272లు వచ్చే విధంగా పనులు చేయించడంతో పాటు, ప్రతి జాబు కార్డుదారులకు వంద రోజులు పని కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలలో సర్వే నిర్వహించి అర్హత కలిగిన వారందరికీ జాబ్ కార్డు అందజేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్లు సమిష్టి కృషితో పనిచేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో వసతులు కల్పించాలని, ఉదయం సమయంలోనూ, సాయంత్రం సమయం లో పని చేసినట్లయితే ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అరుణశ్రీ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో గంగు నాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీడి రోజా రమణి

28న వాహనాల వేలం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ స్పెషల్ ఎన్‌పోర్సుమెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన ఆరు వాహనాలకు బహిరంగ వేలం ఈ నెల 28న నర్సీపట్నం ఎస్ఇబి స్టేషన్ వద్ద నిర్వహించనున్నామని ఎస్ఇబి సిఐ కె.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌పోర్సుమెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌ల పర్యవేక్షణలో జప్తు చేయబడిన వాహనాలకు ఎంవిఐ నిర్ధారించిన ధర నుండి బహిరంగ వేలం వేయనున్నామన్నారు. పాడిన మొత్తంకు అదనంగా జిఎస్టీ కూడా చెల్లించాలన్నారు. ఆసక్తి గల వారు రూ.5000 అడ్వాన్స్ చెల్లించి టోకేన్‌లు పొంది వాహనాలు కొనుగోలు చేయవచ్చునన్నారు.

చోరీల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు నర్సీపట్నం రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.రామారావు ఆధ్వర్యంలో సబ్ డివిజనల్ క్రైమ్ స్పాట్ సిబ్బంది అమలాపురం శివారు ఓలం జీడిపిక్కల ఫ్యాక్టరీలో చోరీల నియంత్రణపై అవగాహన కల్పించారు. వేసవి సమయంలో బయట పడుకునే సమయంలో దొంగతనాలు జరుగుతుంటాయని, ఇవి జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సైబర్ నేరాలపై తెలిపారు. అత్యవసర పరిస్థితులలో టోల్ ఫ్రీ నెంబర్లు 100,112లను ఉపయోగిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ స్పాట్ ఇన్చార్జి హెచ్‌సి కే.శ్రీనివాసరావు, సిబ్బంది భరతుడు యుగంధర్ రావు, ప్రొడక్షన్ ఇన్చార్జి శివ, హెచ్‌ఆర్ శంకర్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామారావు

మృతదేహాల తరలింపునకు .. వాహన సదుపాయం కల్పించాలి

సిపిఎం, గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-కొత్తకోట:నాన్ షెడ్యూల్ ఏరియా ప్రాంతాలకు చెందిన గిరిజనులు ఆసుపత్రిలలో మృతి చెందితే మృత దేహాలను తరలించేందుకు మహా ప్రస్థానం వంటి వాహన సాదు పాయాలను తక్షణమే ఏర్పాటు సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె.గోవిందరావు, గిరిజన సంఘం మండల శాఖ అధ్యక్షులు పాంగి చంద్రయ్య తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం రావికమతం మండలం కొత్తకోటలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో చీమలపాడు శివారు కడ గెడ్డ గిరిజన గ్రామానికి చెందిన ఉల్లి వెంకటరావు (37) గత కొన్నాళ్ళు గా ఆరోగ్యం క్షిణించి విశాఖ కెజిహెచ్ లో వైద్య సేవలు పొందుతున్నాడని తెలిపారు. మంగళవారం అర్ధ రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడన్నారు. నిరుపేద ఆదివాసి గిరిజనుడు కావడంతో పాటు మృతిని వద్ద భార్య ఉల్లి ఎర్రమ్మ మాత్రమే ఉండటంతో దిక్కు తోచని స్థితిలో ఉందన్నారు. మృత దేహాన్ని తరలించేందుకు మహాప్రస్థానం వంటి వాహన సదుపాయం లేక ప్రయివేట్ అంబులెన్సులను ఆశ్రయించగా వేల రూపాయిలు డిమాండ్ చేసారని పేర్కొన్నారు. కేజీహెచ్ లో ట్రైబల్ వార్డుకు వెళ్లి ఫిర్యాదు చేయగా అనకాపల్లి జిల్లా ట్రైబల్ ఏరియాకు సంబంధం లేదని చెప్పడంతో ఈ విషయంపై అనకాపల్లి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజనులు ఆరోగ్యపరమైన సమస్యలు వస్తే కేజీహెచ్ ఇతర ప్రాంతాలల్లో మరణిస్తే ఎవరికి చెప్పుకోవాలని తెలియని పరిస్థితిలో ఆదివా సులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాన్ షెడ్యూల్ గిరిజనులకు వైద్య సేవలతో పాటు ప్రత్యేకంగా కేజీహెచ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి. గిరిజనులకి మహాప్రస్థానం ఏర్పాటు చేయాలన్నారు.లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నాన్ షెడ్యూల్ ఏరియా ఆదివాసీలతో ఆందోళన చేస్తామని గోవిందరావు, చంద్రయ్య హెచ్చరించారు....

స్పందించిన కలెక్టర్, ఎపివో

ఈ సమస్య పై అల్లూరు జిల్లా కలెక్టర్, ఐటిడి ఎపి వో స్పందించారు. రావికమతం మండలం చీమల పాడు కడగెడ్డ గ్రామానికి వెంకటరావు మత దేహాన్ని తరలించేందుకు అంబులెన్సు ఏర్పాటు చేశారు.దీనిపై సిపిఎం, గిరిజన సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మోడీని గద్దె దించితేనే దేశానికి రక్షణ

దేవరాపల్లిలో మాట్లాడుతున్న వెంకన్న

కేంద్రంలోని ప్రధాని మోడీని గద్దె దించితేనే దేశానికి రక్షణ కలుగుతుందని సిపిఎం, సిపిఐ నేతలు పిలుపునిచ్చారు. అనకాపల్లిలో జిల్లాలు పలు చోట్ల ప్రచార బేరి ముమ్మరంగా చేపట్టారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

దేవరాపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి రక్షణ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర అన్నారు. ప్రచార భేరిలో భాగంగా బుధవారం దేవరాపల్లిలో ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. మోడీ విధానాలను రాష్ట్రంలోని అధికారలో ఉన్న వైసిపి సమర్థించడం దారుణమన్నారు. దేశంలో ప్రతిపక్షాలు ఉండ కూడదని మోడీ, అమిత్‌షా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యంగాన్ని పక్కనబెట్టి మనుధర్మ శాస్త్రాన్ని తీసుకొచ్చి మతం, కులం పేరుతో ప్రజల మధ్య చీలికలు తేవాలని ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బి నాగేశ్వరరావు, ఎం.దేముడు, పి.లక్ష్మి, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రోలుగుంట లో...

రాంబిల్లి : మండలంలోని లోవపాలెం, గజరెడ్డిపాలెం గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిందని, ఫలితంగా నిత్యవసర వస్తువులు ధరలు కూడా భారీగా పెరిగి సామాన్యులు బతకలేని స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కినా రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్.నూకన్న, వై.రాము, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సముద్రంలో చేపలు వేట నిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం ప్యాకేజీ మత్స్యకారులందరికీ వర్తింపజేయాలని సిపిఎం నాయకులు ఆర్.రాము డిమాండ్ చేశారు. మండలంలోని పూడిమడక పంచాయతీ పరిధిలో బుధవారం ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల వేట ద్వారా ఉపాధి పొందుతున్న మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ మందికి మాత్రమే ఆర్థిక సహాయం ప్రకటించడం సరికాదని పేర్కొన్నారు. మత్స్యకారులకు 50 సంవత్సరాలకే పించన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గనగల నూకరాజు, ధోని అప్పారావు, మాణిక్యం పాల్గొన్నారు.

మాడుగుల: కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీసి, దేశాన్ని కాపాడుకోవాలని గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహ మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నేత భవాని పిలుపునిచ్చారు. ఈ నెల 30 వరకు సిపిఎం, సీపీఐ తలపెట్టిన ప్రచార భేరి కార్యక్రమం బుధవారం మండలంలోని అవు రువాడ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో కార్మికులకు వ్యతిరేకంగా, యాజమాన్యాలకు అనుకూలంగా తీసుకు వచ్చిన కార్మిక చట్టాలు వెంటనే రద్దు చేయాలని కోరారు. కేంద్రం తలపెట్టిన ప్రైవేటీకరణ ను ఆపాలని, అటవీ

అచ్యుతాపురంలో ప్రచారం

చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టం కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోలుగుంట: బిజెపిని గద్దె దించాలని మండలంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆర్ల, ఎంకె.పట్నం, ఎంకే పట్నం, పనసలపాడు, గంగవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, ప్రజలపై రోజు రోజుకి ధరల భారాలు పెరుగుతున్నాయన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ వంటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయ లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోతురాజు, భీమరాజ్, శ్రీను పాల్గొన్నారు.

మాడుగుల మండలంలో ...

జగనన్న వసతి దీవెన నిధులు విడుదల

జిల్లాలో 43,938 మంది విద్యార్థులకు ప్రయోజనం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జగనన్న వసతి దీవెన కింద 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో రూ.41.17 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి ప్రారంభించగా, జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యాన నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా రూ.41,17,45,000 మొత్తాన్ని చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాకు 43,938 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.41.17 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. వసతి దీవెనకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే సచివాలయంలో తెలియజేస్తే పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, జిల్లా బిసి సంక్షేమాధికారి శ్రీదేవి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి, పలు కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, చైర్మన్లు పిళ్లా సుజాత, మధుసూదన్, పిళ్ళా సుజాత, నూకరాజు, అప్పలకొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జగదాంబ జంక్షన్ సమీపంలోని టర్నర్ చౌల్ట్రీకి ఎదురుగా ఉన్న విశాఖపట్నం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు సోదాలు నిర్వహించారు. ఎసిబి అదనపు ఎస్‌పిలు షకీలా భాను, శ్రావణి ఆధ్వర్యాన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా శ్రావణి మీడియాతో మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సోదాలు చేసినట్లు తెలిపారు. అదనపు ఆదాయం, అనధికార వ్యక్తుల గుర్తింపు ఏమీ జరగలేదని చెప్పారు. ఎసిబి సిఐలు శ్రీనివాస్, కిషోర్, విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. రాత్రి కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇదే రోజున పలు తహశీల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఎసిబి సోదాలు నిర్వహించారు.

అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే నెల 1 నుండి 5 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నానికి చెందిన ముగ్గురు మహిళా బాక్సర్లు పాల్గొంటున్నారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. ఈ టోర్నమెంటులో 65 కిలోల విభాగంలో కొలుకుల కృష్ణవేణి, 75 కిలోల విభాగంలో వేపాడ ప్రియాంక, 80 కిలోల విభాగంలో బొంతు మౌనిక పాల్గొంటున్నారని అన్నారు. మహిళా కోచ్, రెఫరీగా పాపాని మౌనిక ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను, రెఫరీని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అభినందించారు. కాగా ఎస్ ఏ ఎన్ చారిటీ వ్యవస్థాపకులు సూరెడ్డి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఎస్‌ఉమా మహేశ్వరి టోర్నమెంట్ లో పాల్గొంటున్న క్రీడాకారులకు రూ.10 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడాకారులు టోర్నమెంట్‌లో చక్కని ప్రతిభ కనబరిచి నర్సీపట్నానికి ఘనత తీసుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, వెలగా జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికల సత్తా

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లాలో రెండవ స్థానం దక్కించుకుంది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 48 శాతం, ద్వితీయ సంవత్సరం 51 శాతం దక్కించుకుంది.డి ఎల్ పురం గ్రామానికి చెందిన కురందాసు వర లక్ష్మి 922 (ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ), రాజయ్యపేట గ్రామానికి చెందిన టి రత్నం 914 (ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి), కోడ స్వప్న 894, ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిఇసి), తీనార్ల కు చెందిన సిరిపల్లి మేరీ 864 (ద్వితీయ సంవత్సరం హెచ్ ఈ సి) సాధించినట్లు ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. స్థానిక ఏపీ రెసిడెన్షియల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం 48 శాతం, ద్వితీయ సంవత్సరం 54 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఏ.అరుణ 962 (ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ),ఎస్‌మీనాక్షి 968 , ద్వితీయ సంవత్సరం బైపిసి మార్కులు సాధించారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. కాలేజిలో చదువుతున్న సి.హెచ్ భాగ్యశ్రీ 973 మార్కులు, మూకల సత్య వెంకటి 972 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ జి.చిన్నారావు అధ్యాపకులు శర్మ, మని అభినందించారు.

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల: ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు బుదవారం తారువ క్యాంప్ కార్యాలయం లో పంపిణీ చేశారు. మాడుగుల మండలం ఎం కోడూరుకు చెందిన చింత సోమకేశ్వరరావు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. దీని నిమిత్తం ఆసుపత్రి బిల్లులతో సహా ,కుటుంబ సభ్యులు ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయగా మంజూరు అయ్యింది. ఆయన కుమారుడు చింత వెంకట నారాయణ మూర్తికు ఉప ముఖ్యమంత్రి చెక్కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంజీవరావు, పడాల అప్పలనాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు

చెక్కు అందిస్తున్న మంత్రి

పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ: కృష్ణదేవిపేట పిహెచ్‌సి ని అల్లూరి జిల్లా టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, ప్రపంచ ఆరోగ్య సంస్థ టిబి విభాగం కన్సలెంట్ డాక్టర్ విఘ్నేష్, టిబి కంట్రోల్ యూనిట్‌కు చెందిన శ్రీనివాస్‌లు బుధవారం తనిఖీ చేశారు. పిహెచ్‌సి పరిధిలోని గిరిజన గ్రామాల్లోని టిబి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంత మంది రోగులు ఉన్నారు, ఎంత మంది చికిత్స పొందుతున్నారో రికార్డు పరంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ హరిప్రవీణ్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పర్యటిస్తున్న ఉన్నతాధికారులు

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో అడ్డ రోడ్డు గ్రామానికి చెందిన కే.శ్రీనివాసరావు బంగారు వ్యాపారి దుకాణంలో సోమవారం జరిగిన చోరీ కేసులో ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసినట్లు ఎస్ రాయవరం ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. వివరాల్లోకెళితే పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు గ్రామానికి చెందిన కవిడి దుర్గ అలియాస్ ఝాన్సీ, కొల్లి మణి అలియాస్ ఆకులు పద్మలు బంగారు కొనుగోలు చేసే సాకుతో షాపులోకి వెళ్లి అక్కడ షాప్ యజమాని, ఇతర సిబ్బందిని మాటల్లో పెట్టి బంగారు దోచుకుంటారు. సోమవారం జరిగిన చోరీ కేసులో మూడు వందల ఎనిమిది గ్రాముల వెండిని స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసి రిమాండకు తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపాన వున్న జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 14వ ఆరాధనోత్సవాలు ఈనెల 27 నుంచి మే 6వ తేదీ వరకూ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. 27న స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామతాభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన, 28న నిత్యపూజలు, కోలాట ప్రదర్శనలు, 30న పూర్ణాహుతి, మండపారాధన, స్వామివారి సజీవ సమాధి కార్యక్రమం, మే 1న స్వామివారి ఊరేగింపు, 6వ తేదీన ఆలయం వద్ద అన్న సమారాధన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు .